తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
03 జూలై 2026
పేజీలు : 8

# బడి కాదు.. అది 'దోపిడీ' అడ్డా..!

○ ప్రైవేటు పాఠశాలలపై తల్లిదండ్రుల ఆగ్రహం
○ఫీజుల బాదుడు.. పుస్తకాలు, యూనిఫాంల పేరిట అదనపు భారం
○భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల రవాణాపై ప్రశ్నలు

**అన్నపురెడ్డిపల్లి, జూలై 2 జనంసాక్షి :** విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రైవేటు పాఠశాలలు నేడు కొన్నిచోట్ల వ్యాపార కేంద్రాలుగా మారాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలను పక్కనబెట్టి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపిస్తున్నారు.
బయట మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను రెట్టింపు ధరలకు విక్రయిస్తూ, యూనిఫాం, బెల్ట్ తదితర వస్తువులను కూడా పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యా సంవత్సరమంతా వివిధ పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫీజులు ఆలస్యమైతే విద్యార్థులను తరగతి గదుల బయట నిలబెట్టడం, బదిలీ ధ్రువీకరణ పత్రం (టీసీ) ఇస్తామని హెచ్చరించడం వంటి చర్యలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.
ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో నెం.1 (2020) ప్రకారం నిర్దేశించిన పరిమితులకు మించి ఫీజులు పెంచుతున్నారని, సంబంధిత




అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు కనిపించడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. అంతేకాకుండా, కొన్ని పాఠశాలల్లో భవన నిర్మాణం, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, పంచాయతీ అనుమతులు (ఎన్‌ఓసీ), విద్యార్థులకు అవసరమైన క్రీడా మైదానాల లభ్యత వంటి అంశాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పక్క గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకువచ్చే మినీ వ్యాన్లలో అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించడం, అర్హత కలిగిన లైసెన్స్ లేని డ్రైవర్లతో వాహనాలు నడుపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి:**
ప్రైవేటు పాఠశాలలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని, ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పుస్తకాలు, యూనిఫాంలను తల్లిదండ్రులు తమకు నచ్చిన చోట కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ కల్పించాలని కోరుతున్నాయి. సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పాఠశాలల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.






జనంసాక్షి ఎఫెక్ట్

## అంబేద్కర్ విగ్రహం చుట్టూ తొలగిన పార్టీ జెండాలు, తోరణాలు




**నల్లగొండ ప్రతినిధి, జూలై 2 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాలు, తోరణాలను అధికారులు, అధికార పార్టీ నాయకులు తొలగించారు. దీనికి జనం సాక్షిలో ప్రచురితమైన వార్త ప్రభావమే కారణమైంది. అంబేద్కర్ విగ్రహం చుట్టూ రాజకీయ పార్టీ జెండాలు, తోరణాలు ఏర్పాటు చేయడంపై అంబేద్కర్ వాదులు, సామాజిక సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని రాజకీయ హంగులతో చుట్టుముట్టడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, వెంటనే వాటిని తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని జనం సాక్షి ప్రాధాన్యతతో ప్రచురించగా, సంబంధిత అధికారులు స్పందించారు. అధికార పార్టీ నాయకుల సహకారంతో అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన జెండాలు, తోరణాలను తొలగించారు. ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురిస్తే స్పందన తప్పదని మరోసారి ఈ ఘటన నిరూపించిందని పలువురు అంబేద్కర్ వాదులు, స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన జనం సాక్షికి వారు అభినందనలు తెలిపారు.





## నష్టపరిహారం ప్రకటించిన తర్వాతే సర్వే

### రాయగిరి రైతుల స్పష్టం

**భువనగిరి, జూలై 2 (జనంసాక్షి)**
త్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్) ప్రాజెక్టు కోసం భూముల సర్వే చేపట్టే ముందు రైతులకు అందించే నష్టపరిహారం, భూముల విలువలపై స్పష్టత ఇవ్వాలని, అప్పటి వరకు సర్వేకు సహకరించబోమని రాయగిరి రైతులు స్పష్టం చేశారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, ఆర్డీవో సమక్షంలో నిర్వహించిన సమావేశంలో రైతులు తమ సమస్యలను, డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఐదుసార్లు భూములు కోల్పోయామని, మరోసారి భూములు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడినందున ఈసారి మార్కెట్ విలువలకు అనుగుణంగా గజాల ప్రాతిపదికన నష్టపరిహారం నిర్ణయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాయగిరి రైతులు ఇప్పటికే పలుమార్లు భూములు కోల్పోయిన విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, రైతులకు న్యాయం జరిగేలా మార్కెట్ విలువలను

మిగతా 2లో

## సరైన ఆధారాలు లేకుండా ఓట్లను తొలగించరాదు

○ప్రత్యేక సమగ్ర సవరణ పకడ్బందీగా నిర్వహించాలి ○ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**కొండమల్లేపల్లి, జులై 2 (జనంసాక్షి):** ఓటరు నమోదు, మార్పులు చేర్పులు లేదా తొలగింపుల సమయంలో బూత్ లెవల్ ఎజెంట్లు పూర్తి అప్రమత్తతతో అవగాహనతో వ్యవహరించాలని ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయి కృప ఫంక్షన్ హాల్ లోసమగ్ర సవరణ కార్యక్రమంపై మండల పరిధిలో గల 34 మంది బూత్ లెవల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ ప్రతి ఓటును కాపాడుకునే బాధ్యత కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లపై ఉందని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి బిఎల్ఎ పూర్తి స్థాయిలో అవగాహనతో నిర్వహించాలని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత పేర్లను నమోదు చేయడంతో



పాటు తప్పుగా తొలగించిన లేదా పొరపాట్లు ఉన్న ఓట్లను వెంటనే సవరించాలని కోరారు. ఓటు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని పౌరునికి ఓటు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును తప్పకుండా నమోదు చేయించి కాపాడాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సర్ ప్రక్రియలో బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే కుట్ర చేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏ లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దరఖాస్తును

మిగతా 2లో

# సరైన ఆధారాలు లేకుండా ఓట్లను తొలగించరాదు



పరిశీలిస్తూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి బూతును స్వయంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటును కాపాడేందుకు కృషి చేస్తానని అన్నారు. ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం లేదా విద్యాభ్యాసం కోసం వలస వెళ్లిన దేవరకొండ నియోజకవర్గ ఓటర్ల వివరాలను కూడా గుర్తించి వారి ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని బిఎల్‌ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలకు సూచించారు. అనంతరం సర్ కార్యక్రమానికి సంబంధించిన నమోదు, మార్పులు, తొలగింపులు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై బిఎల్‌ఏలు, బూత్ కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ముఖ్య కార్యకర్తలకు ఎమ్మెల్యే సమగ్ర అవగాహన కల్పించి కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రతి బూతులో యూత్ కాంగ్రెస్ నాయకులు, చదువుకున్న యువత, పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, ప్రతి ఓటును కాపాడడంతో పాటు పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే బాలు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని మాధవరెడ్డి, పిఏసిఎస్ ఛైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి, దూదిపాల శ్రీధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్ యాదవ్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నష్టపరిహారం ప్రకటించిన తర్వాతే సర్వే

## రాయగిరి రైతుల స్పష్టం

పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులను కోరారు.రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం నష్టపరిహారం వివరాలను అధికారికంగా ప్రకటించిన అనంతరమే భూముల సర్వే చేపట్టాలని, అప్పటి వరకు సర్వేకు అనుమతించబోమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ట్రిపుల్ ఆర్ ఉద్యమకారులు తంగళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్, పల్లెర్ల యాదగిరి, గడ్డమీద మల్లేష్, అవిషెట్టి పాండు, బల్ల శివశంకర్, కోటాల ఈశ్వరయ్య, తెల్జేరి ఐలయ్య, సాధనమైన సురేష్, ముద్దం స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ సిసి విద్యార్థులు అగ్నివీర్ కి ఎంపిక



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 2 ( జనం సాక్షి )** స్థానిక ఎస్ ఆర్ బిజిఎన్ఆర్ కళాశాల ఎన్ సి సి విద్యార్థులు ఐదుగురు ఇటీవల ప్రకటించిన అగ్నివీర్ కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా గురువారం అభినందన పూర్వక ప్రకటనలో తెలిపారు.జోయల్ వెస్లీ నేవీ విభాగం లో, ధీరజ్,అజయ్, వినయ్, గోపిచంద్ ఆర్మీ విభాగం లో ఎంపికయ్యారని తెలిపారు. ఎన్ సి సి విద్యార్థులకు యూనిఫాం ఉద్యోగాల్లో ప్రత్యేకమైన రిజర్వేషన్లతో పాటు అదనపు మార్కులు ఉన్నాయని కళాశాల ఎన్ సి సి ఏఎన్ఓ లెఫ్టినెంట్ డా. ఓంకార్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు తోపాటు ఎన్ సి సి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కే భద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పంకజ్ విద్యార్థులను అభినందించారు.భారత సైన్యంలో గొప్ప అవకాశంగా భావించాలని తెలిపారు.



A. Ajay B.Gopichand G.Vinay



# పారిశుధ్యంపై మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి

## -ఎదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత

**ఖమ్మం రూరల్, జూలై 2:(జనం సాక్షి).**

ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తు, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహించడం జరుగుతుందని మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ పోకబత్తిని.అనిత పేర్కొన్నారు. గురువారం తొలి రోజు 10 వార్డుల్లో విస్తృత స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి డ్రైనేజీలను శుభ్రం చేయడం, చెత్తను తొలగించడం, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న అవరోధాలను తొలగించడం వంటి పనులను మున్సిపల్ సిబ్బంది వేగంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్యం, నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడమే మున్సిపాలిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా వినియోగిస్తూ ప్రతి వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు బుర్ర మహేష్, బానోతు ప్రసాద్, భానోత్ దివ్య, కడవ నవీన్, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి కార్యకర్త పాల్గొనాలి

## రావులపల్లి రాంప్రసాద్

**భద్రాచలం జూలై 02 (జనంసాక్షి)**

ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని న్యాయమైన ప్రతి ఓటును కాపాడేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం భద్రాచలంలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంలోని 179 పోలింగ్ బూత్‌ల పరిధిలో కార్యకర్తలు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొని ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం పార్టీ నాయకుడు మానే రామకృష్ణ మాట్లాడుతూ, రాబోయే రోజులు బీఆర్ఎస్‌కే అనుకూలంగా ఉంటాయని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని అన్నారు.ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు ప్రబోద్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, ఉడతా రమేష్, సునీల్ కుమార్, వార్డు సభ్యుడు గోపి, గోసుల శ్రీనివాస్, కావూరి సీతామాలక్ష్మి, తెల్లం కామేశ్వరి, కణితి రాధ, ఎండి ముంతాజ్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.





# పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పనిచేయాలి

## - సీపీఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు

## - సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా

**భద్రాచలం జూలై 02 (జనంసాక్షి)**

తెలంగాణలో ఏర్పడుతున్న రాజకీయ, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో పార్టీ శ్రేణులు ప్రజా సమస్యలపై మరింత అవగాహన పెంపొందించుకుని సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా అన్నారు. భద్రాచలంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 7, 8, 9 తేదీల్లో సీపీఐ ఉమ్మడి జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా ఉద్యమాల దిశ, సామాజిక-ఆర్థిక అంశాలపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.2022 గోదావరి వరదల సమయంలో భద్రాచలం నియోజకవర్గంలో జరిగిన నష్టాలపై ప్రభుత్వం ఇప్పటికీ పూర్తి స్థాయిలో స్పందించలేదని విమర్శించారు. వరద బాధితులకు శాశ్వత పరిష్కారాలు చూపడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అదేవిధంగా, భద్రాచలం డివిజన్‌లో పలు సమస్యలు నెలకొన్నాయని పేర్కొంటూ, ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. శిక్షణ తరగతులను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# భద్రాద్రి రామయ్య నిత్య కళ్యాణం

**భద్రాచలం జూలై 02 (జనంసాక్షి)**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. జ్యేష్ఠ మాసం గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, గురువారం ఉత్తరషాఢ నక్షత్రం సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేడా మండపంలో భక్తజనుల మధ్య, వేదమంత్రోచ్ఛారణల నడుమ కళ్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనం పలికారు.

# భద్రాచలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో ముగ్గురికి రెండు రోజుల జైలు

**భద్రాచలం జూలై 02 (జనంసాక్షి)**

భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు న్యాయస్థానం రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది.పోలీసులు నిందితులను భద్రాచలం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం రాందాస్ ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం ప్రతి ఒక్కరికి రెండు రోజుల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.ఈ సందర్భంగా భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు



**బూర్గంపహాడ్ జూలై 02 (జనంసాక్షి):**
మొదటి దఫా ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐటీఐ భద్రాచలం ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2026 ఆగస్టు విద్యా సంవత్సరానికి జాతీయ వృత్తి శిక్షణ మండలి (ఎన్సీవీటీ) విధానంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల (ఏటీసీ)లోని వివిధ ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్, వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ (ఎఫ్ఈఎం), సిఎన్‌సి మెషినింగ్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, ఇంజినీరింగ్ డిజైన్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ అసలు ధ్రువపత్రాల వివరాలతో తెలంగాణ ఐటీఐ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలి విడత ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువును జూలై 10 వ తారీకు వరకు పొడిగించినట్లు వెల్లడించారు. ప్రతిరోజూ ఆన్‌లైన్ మెరిట్ ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు వారి మొబైల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందజేస్తామని తెలిపారు. ఎంపికైన వారు ఐటీఐ రిజిస్ట్రేషన్ ఫారం, పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఒకటి నుంచి పదో తరగతి వరకు బోనాఫైడ్ ధ్రువపత్రాలు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టీసీ), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అన్ని ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఇతర అవసరమైన పత్రాలతో సంబంధిత ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐలో హాజరై ప్రవేశ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. 2026 తొలి విడత వాక్-ఇన్ అడ్మిషన్లకు కూడా ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కోరారు.

### రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర ఆధ్వర్యంలో..

# వైద్యులకు ఘన సన్మానం



**బూర్గంపహాడ్ జూలై 02 (జనంసాక్షి)**
జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బూర్గంపహాడ్ మండలం సారపాకలోని ఐటీసీ?పీఎస్‌పీడీ (భద్రాచలం) అనుబంధ సంస్థ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్ర ఆధ్వర్యంలో బుధవారం వైద్యులను ఘనంగా సన్మానించారు. గత సంవత్సరం రోటరీ క్లబ్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. అలాగే రోటరీ క్లబ్ నూతన కమిటీ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సభ కార్యక్రమానికి యూనిట్ హెడ్ సైలేంద్రకుమార్ సింగ్ అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షులు రోటరీ క్లబ్ రొటేరియన్ ఆర్పి సింగ్ కార్యదర్శి డేవిడ్ ఆలివర్, క్లబ్బు పూర్వాధ్యక్షులు కే రాంబాబు, జయంత్ దాస్, భాస్కర్, జనరల్ మేనేజర్ హెచ్ ఆర్ శ్యామ్ కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక డాక్టర్ కాకర్ల హేమంత్, డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బి హరికృష్ణ, కంపెనీ ఓహెచ్సి డాక్టర్ విజయకుమార్, డాక్టర్ అమృతసింధు వైద్యులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వారి పాత్ర ఎంతో గొప్పదని వక్తలు కొనియాడారు. కార్యక్రమం లో పాల్గొన్న వైద్యులకు, సిబ్బందికి, నిర్వాహకులకు సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు చంగల్ రావు, ప్రపుల్లా, మురళీకృష్ణ, మురళీధర్, సూర్య ప్రకాష్ రావు, గోవిందరావు, శివరామకృష్ణ, సాయిరాం, రంజిత్, కిషోర్, గుత్తేదారు సభ్యులైన పాకాల దుర్గాప్రసాద్, సత్యనారాయణ, బసవపు రమేష్, ఏసుబాబు, వీర్రాజు, రోటరీ యాక్ట్ సభ్యులైన చరణ్, రమ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్ల జాబితాపై సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు..

### సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట..

**భద్రాచలం జూలై 02 (జనంసాక్షి)**



పారదర్శక ఓటరు జాబితా రూపకల్పన లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)- 2026 కార్యక్రమానికి సంబంధించి ఓటర్లకు అవసరమైన సమాచారం అందించేందుకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు భద్రాచలం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్ఓ), సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ, పేర్ల నమోదు, ఇతర అంశాలకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం ప్రజలు 90140 49749 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. అలాగే కార్యాలయ పని వేళల్లో నేరుగా భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట విజ్ఞప్తి చేశారు.

# మొరంపల్లి బంజరలో ఇంటింటి ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ..

**బూర్గంపహాడ్ జూలై 02 (జనంసాక్షి)**
ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామంలో ఇంటింటి ఎస్ఐఆర్ ఫారాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరారెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలందరూ బీఎల్ఓలు, ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఇంటింటికీ వచ్చే అధికారులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహకరిస్తానని వీరారెడ్డి తెలిపారు.





# ఉద్యోగాలు లేక పక్కదారులు పడుతున్న నిరుద్యోగులు

**ఖమ్మం కార్పొరేషన్ , జూలై 2 (జనంసాక్షి)**
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం యువతకు సరిపడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యాయని, దీనివల్ల నిరాశకు గురైన యువత పక్కదారులు పడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పి.వై.ఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. రాకేష్, జిల్లా కార్యదర్శి జక్కుల భరత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.
?ఖమ్మం నగరంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో పి.వై.ఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్ సింగ్ అధ్యక్షతన పి.వై.ఎల్ జిల్లా కమిటీ సమావేశం లో వారు మాట్లాడుతూ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగులను తీవ్రంగా వంచించిందని ధ్వజమెత్తారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే యువతకు పెద్దపీట వేస్తామని, ఉద్యోగాల జాతర చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని విమర్శించారు. చదువు పూర్తి చేసుకుని, ఏళ్లకేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు సరైన ఉపాధి దొరకక మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు.
??సమాజానికి వెన్నెముకగా నిలవాల్సిన యువశక్తి.. ఉపాధి లేక, భవిష్యత్తు అగమ్యగోచరంగా మారడంతో తీవ్ర నిరాశలో మునిగిపోతోంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని డ్రగ్స్, గంజాయి మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వాల వైఫల్యం వల్లే నేడు గల్లీ గల్లీలో గంజాయి, మత్తు పదార్థాలు విచ్చలవిడిగా లభిస్తూ యువత జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి." అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.?యువత పక్కదారులు పట్టి నేరాల వైపు మళ్లకుండా ఉండాలంటే ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, కొత్త పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.



# ఖమ్మం జిల్లాలో యూరియా కొరత లేదు..

## జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య

**ఖమ్మం కార్పొరేషన్, జూలై-2( జనంసాక్షి )**
వానాకాలం?2026 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించిందని, జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.
ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 691.13 మెట్రిక్ టన్నులు (15,359 బస్తాలు), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్ద 920.02 మెట్రిక్ టన్నులు (20,445 బస్తాలు), మార్క్ ఫెడ్ ఖమ్మం వద్ద 7,656.16 మెట్రిక్ టన్నులు (1,70,137 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991.51 మెట్రిక్ టన్నులు (22,034 బస్తాలు), కమిషనర్ రిజర్వ్ పూల్ (సీఆర్‌పీ)లో 6,898.05 మెట్రిక్ టన్నులు (1,53,290 బస్తాలు) నిల్వ ఉన్నాయని తెలిపారు.2026 జూలై 2 నాటికి జిల్లాలో మొత్తం 17,156.88 మెట్రిక్ టన్నుల యూరియా (3,81,264 బస్తాలు) అందుబాటులో ఉందని పేర్కొన్నారు.జిల్లాలో ఇప్పటి వరకు యూరియా యాప్ ద్వారా 56,926 మంది రైతులు 1,80,738 బస్తాలను బుక్ చేసుకొని, 1,60,316 బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. యూరియా యాప్ ద్వారా రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియాను బుక్ చేసుకుని కొనుగోలు చేస్తున్నారని వివరించారు.రైతు సోదరులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా అవసరమైన మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.ప్రతి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని, రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# 'వైటీడీ' బోర్డులో స్థానికులకు అవకాశం కల్పించాలి

## ప్రెస్ క్లబ్ కు పెండింగ్ పనులకు సహకరిస్తా - ఇ ఎల్ వి భాస్కర్ ( ఇరుగదిండ్ల లక్ష్మమ్మ వీరయ్య) ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్

**యాదగిరిగుట్ట జూలై 2 (జనంసాక్షి)**
ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్(వైటీడీ) బోర్డులో స్థానికులకు అవకాశం దక్కకపోవడం బాధాకరమని, సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచన చేసి వైటీడీ బోర్డులో స్థానికులకు అవకాశం కల్పించాలని ఇరుగుదిండ్ల లక్ష్మమ్మ వీరయ్య భాస్కర్(ఇ ఎల్ వి) ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు(టీటీడీ బోర్డు) వలె వైటీడీ బోర్డును కూడా విస్తరింపజేయాలని సూచించారు. వైటీడీ బోర్డులో టీటీడీ మాదిరిగా స్థానికులకు ప్రాధాన్యత ఇస్తూనే పక్క రాష్ట్రాల వారికి కూడా చోటు కల్పించాలని కోరారు. ఇక తమ ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి కోసం సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడున్న పేదలకు మెరుగైన వైద్యం అందేలా చూడడమే కాకుండా ట్రీట్‌మెంట్ కు అయ్యే ఖర్చును సైతం తమ ఫౌండేషన్ భరిస్తుందని తెలిపారు. అలాగే ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యను అభ్యసించలేని పేద పిల్లలను ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ద్వారా చదివిస్తున్నామని చెప్పారు. విద్య, వైద్యం కోసం ఎలాంటి సహకారం కావాలన్నా తమ ఫౌండేషన్ ను సంప్రదించాలని సూచించారు.

**ప్రెస్ క్లబ్ కు పెండింగ్ పనులకు సహకరిస్తా**
యాదగిరిగుట్టలో నిధుల కొరత కారణంగా మధ్యలోనే నిలిచిపోయిన ప్రెస్ క్లబ్ భవన పెండింగ్ పనులను పూర్తి చేయడానికి సహకరిస్తామని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ హామీ ఇచ్చారు. యాదగిరిగుట్టలోని ప్రెస్ క్లబ్ భవనాన్ని సందర్శించిన ఆయన.. ప్రెస్ క్లబ్ పూర్తి కావడానికి ఏమేమీ కావాలో జర్నలిస్టులను అడిగి తెలుసుకున్నారు. ప్రెస్ క్లబ్ పెండింగ్ పనులను ఇ ఎల్ వి ఫౌండేషన్ ద్వారా పూర్తి చేస్తామని, అంతేకాకుండా ప్రెస్ క్లబ్ భవనం వెనుకాల విశాలమైన ప్రదేశంలో రేకుల షెడ్డును సైతం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ పెండింగ్ పనులు, రేకుల షెడ్డు నిర్మాణ పనులు ఆగస్టు 15లోపు ఫినిష్ చేసి.. ప్రెస్ క్లబ్ ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రెస్ క్లబ్ వద్ద కొబ్బరికాయ కొట్టి పెండింగ్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు,రాయగిరి పాండు, పేరబోయిన నర్సింహులు, బబ్బూరి యాదగిరి గొట్టిపర్తి ఉపేందర్, గుండ్ల వెంకటేష్ ఈఎల్వీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.





# అనారోగ్యం భరించలేక గడ్డి మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

**గుర్రంపోడు, జులై 02,(జనంసాక్షి) :**



దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలను భరించలేక మనస్తాపంతో ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన గుర్రంపోడు మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిట్టల గూడెం గ్రామానికి చెందిన పగిడిమర్రి ఎల్లయ్య (66) వృత్తిరీత్యా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన గత పదేళ్లుగా బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. ఇందులో భాగంగా ప్రతిరోజు రెండు పూటలా షుగర్ నియంత్రణ కోసం ఇన్సులిన్ ఇంజక్షన్లు తీసుకుంటున్నాడు. కొంతకాలంగా తీవ్ర నీరసానికి గురికావడంతో శారీరకంగా కుంగిపోయాడు. అనారోగ్యంపై తీవ్ర మనస్తాపం చెందిన ఎల్లయ్య జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన నివాసం వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్పందించి, చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి 11:00 గంటల ప్రాంతంలో ఎల్లయ్య తుదిశ్వాస విడిచాడు. మృతుడి కుమారుడు పగిడిమర్రి నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుర్రంపోడు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# యడవల్లి మత్స్య సొసైటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్యానల్ కైవాసం



**నూతనకల్ జూలై 2 (జనంసాక్షి)**
మండల పరిధిలోని యడవెల్లి గ్రామపంచాయతీలో మత్స్య సొసైటీ ఎన్నికలు జరగగా మొత్తం 150 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు 9 మంది అభ్యర్థులు పోటీ చేయగా బిఆర్ఎస్ ప్యానల్ 5, కాంగ్రెస్ ప్యానెల్ 4 గెలుపొందారు మత్స్య సొసైటీ చైర్మన్ గా మన్యం ముత్తయ్య, వైస్ చైర్మన్ గా నక్క లింగయ్య ప్రధాన కార్యదర్శిగా పిట్టల భరత్ ఎన్నికయ్యారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జటంగి సరిత కృష్ణ యాదవ్, బిఆర్ఎస్ మండల నాయకులు గాజుల తిరుమలరావు గ్రామ బిఆర్ఎస్ కార్యకర్తలు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి - 6 గురి అరెస్ట్

**జనంసాక్షి, మిర్యాలగూడ :**
పేకాట స్థావారం పై దాడీ చేసి 6 గురిని అరెస్ట్ చేసిన సంఘటన మిర్యాలగూడ మండలం లో చోటుచేసుకున్నది.. మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని వెంకటాద్రిపాలెంలో నయారా పెట్రోల్ బంకు వెనుక గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 7 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, ఒక వ్యక్తి పోలీసులను చూసి పరార య్యాడు. పట్టుబడిన వారి నుండి 2,790/- నగదు, 5 సెల్ ఫోన్లు, 5 మోటార్ సైకిళ్ళు, 104 ప్లేయింగ్ కార్డులు మరియు గ్రౌండ్ షీట్×ను స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలో పంచనామా నిర్వహించి, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామని అన్నారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు అని ప్రజలు అలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా పేకాట ఆడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు.

# ట్రాక్టర్ ఢీకొని విశ్రాంత పోస్ట్ మాస్టర్ మృతి

**పెన్ పహాడ్, జూలై 02 (జనంసాక్షి) :**



ట్రాక్టర్ ఢీకొని విశ్రాంత పోస్టుమాస్టర్ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో గురువారం చోటుచేసు కుంది. ఎస్సై కస్తాల గోపికృష్ణ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన విశ్రాంత పోస్టుమాస్టర్ కన్మంత రెడ్డి కృపాకర్ రెడ్డి వయస్సు 70 సంవత్సరాలు తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి , సైకిల్ పై ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన వెన్న గోపిరెడ్డి ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే కృపాకర్ రెడ్డి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృపాకర్ రెడ్డికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య కన్మంత రెడ్డి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపికృష్ణ తెలిపారు.



# అన్యాక్రాంతమైన దేవస్థాన భూములపై అధికారుల సర్వే

**భూదాన్ పోచంపల్లి, జూలై 2 (జనం సాక్షి ):**



శ్రీ రాజగోపాల స్వామి దేవస్థానానికి చెందిన దేవుని మాన్యాలు అన్యాక్రాంతం కావడంతో గురువారం మండలంలోని ఇంద్రియాల గ్రామ పరిధిలో ఉన్న దేవస్థాన భూములపై అధికారుల బృందం సర్వే నిర్వహించింది. దేవస్థాన కమిటీ చైర్మన్ చింతల రామకృష్ణ ఆధ్వర్యంలో మండల సర్వే అధికారి భూములను పరిశీలించి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మదాయ శాఖ మండల ఇంచార్జి వెంకట్ రెడ్డి బృందం భూములను పరిశీలించింది. అనంతరం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అన్యాక్రాంతమైన దేవుని భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, అక్రమంగా కబ్జాలో ఉన్న వారిని త్వరలోనే తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎర్ర చిన్న నారాయణ, ఎర్ర శంకరయ్య, జింక సత్యనారాయణ, పావిరాల లింగస్వామి, మొగిలిపాక శ్రీనివాస్, భీమగోని ఉండటి ప్రసాద్, శనిగరం ఐలయ్య, ఉడుతల రామకృష్ణ, తాడూరి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ బిల్లును రద్దు చేయాలి

**భూదాన్ పోచంపల్లి, జూలై 2 (జనం సాక్షి):**



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వీబీజీ రామ్‌జీ బిల్లు 2025ను వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లును అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్లేకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ కొత్త విధానం వల్ల గ్రామీణ ప్రాంత వికలాంగుల ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వికలాంగునికి జాబ్ కార్డు జారీ చేసి 200 రోజుల ఉపాధి కల్పించాలని, రోజువారీ కూలీని రూ. 800కు పెంచాలని డిమాండ్ చేశారు. విబీజీ రామ్‌జీ బిల్లును రద్దు చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ డివిజన్ అధ్యక్షులు శివయ్య, మండల అధ్యక్షులు రాములు, కార్యదర్శి పాముకుంట వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్

**రామన్నపేట, జూలై 2 (జనంసాక్షి):**




రామన్నపేట మండలంలోని తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డు, 250 చదరపు గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ చలో భూదాన్ కార్యక్రమానికిటిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకురామన్నపేట తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ కె చాంద్, మండల అధ్యక్షులు నోముల శంకర్, మండల ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇమామ్ తదితరులు అరెస్టు చేశారు.

# యాదగిరిగుట్ట దేవస్థాన పాలక మండలిలో స్థానికులు, మాదిగలకు అన్యాయం. వెంటనే సవరణ చేయాలి : ఎమ్మార్పీఎస్



**యాదగిరిగుట్ట జూలై 2 (జనంసాక్షి)**
తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలిని ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ నాయకత్వంలో స్వాగతిస్తున్నామని, అయితే ప్రకటించిన పాలక మండలి కూర్పు సామాజిక న్యాయాన్ని పూర్తిగా విస్మరించి, స్థానికులను అవమానపరిచే విధంగా ఉందని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు బూషి మహేష్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిసాల ఉప్పలయ్య మాదిగ తీవ్రంగా మండిపడ్డారు.
యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధి పేరుతో ఏర్పాటు చేసిన పాలక మండలిలో యాదగిరిగుట్ట ప్రాంత ప్రజలకు, స్థానికంగా సేవలందిస్తున్న వ్యక్తులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా, స్థానికేతరులతో కమిటీని నింపడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. దేవస్థానం అభివృద్ధిలో స్థానికుల పాత్రను పూర్తిగా పక్కనపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి ఒక్కరికీ కూడా తగిన అవకాశం కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. ఎస్సీ వర్గాలకు సామాజిక న్యాయం చేస్తామని చెప్పే ప్రభుత్వం, కీలకమైన దేవస్థాన పాలక మండలి నియామకాల్లో అదే సామాజిక న్యాయాన్ని ఎందుకు అమలు చేయలేకపోయిందని ప్రశ్నించారు.
యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి నిరంతరం సేవలందిస్తున్న స్థానికులు, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో ముందున్నవారు, సామాజిక సేవకులు, అలాగే మాదిగ సామాజిక వర్గానికి చెందిన అర్హులకు వెంటనే పాలక మండలిలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.
ప్రస్తుత పాలక మండలిని విస్తరించి స్థానికులకు, మాదిగ సామాజిక వర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించకపోతే ఎమ్మార్పీఎస్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటించి, దేవస్థానం ఎదుట భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించడానికి వెనుకాడదని ప్రభుత్వం గమనించాలని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కూరెల్ల రమేష్, బైరపాక నాగరాజ్, క్యాసా గళ్ల రమేష్, గుర్రం మహేందర్, సంఘీ స్వామి బొట్ల శ్రీను, కొంపెల్లి వెంకట్, చల్లూరి యాదగిరి, కలకుంట్ల రమేష్, ఇటికల శ్రీను, ముద్దపాక కృష్ణ, బొట్ల అనిల్, ముద్దపాక రత్నాకర్, బోగారం మురళి, సంఘి మైసయ్య, బోయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కరపత్రం ఆవిష్కరించిన సర్పంచ్

**రామన్నపేట, జూలై 2 (జనంసాక్షి):**
రామన్నపేట పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఈనెల 4, 5, 6, తేదీలలో మూడు రోజులపాటు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాలను గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటె రమేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్ మాట్లాడుతూ 4వ తేదీన శనివారం రోజున బ్రహ్మోత్సవ అంకురార్పణ ప్రత్యేక పూజ, ధ్వజారోహణ అనంతరం హోమము నిర్వహించబడును. ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు 11 గంటల 15 నిమిషాలకు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడును. అనంతరం ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.
సోమవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం ఊరేగింపు ఉంటుందని, ఈ బ్రహ్మోత్సవాల్లో రామన్నపేట మండల, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాల్వేర్ అశోక్, జెల్ల వెంకటేష్, గోదాసు సుగ్రీవులు, ఊట్కూరు నరసింహ, వనం అంజయ్య, కోట సుధాకర్, పూజారి శ్రీనివాస్ ఆచార్యులు, భూసాని యాదగిరి, రాధా కిషన్, వార్డు సభ్యులు సుర్వి హరిబాబు, ఊట్కూరు శీను, ఆలయ కమిటీ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై మెరుపు దాడి..

**అశ్వరావుపేట జూలై 2,(జనంసాక్షి):**
అశ్వరావుపేట మండలం వినాయకపురం గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం పై అశ్వరావుపేట ఎస్ఐ యయాతి రాజు మరియు సిబ్బంది మెరుపు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రెండు మోటార్ సైకిళ్ళు మరియు నగదు 5,500/- స్వాధీనపరచుకొని కేసు నమోదు చేయడం జరిగింది. పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అశ్వరావుపేట ఎస్ఐ యాయాతి రాజు సూచించారు. ప్రజలు జూదం సంబంధించిన సమాచారాన్ని dial 100 కి కాల్ చేసి సమాచారం అందించగలరని విజ్ఞప్తి చేశారు.

# వి బి జి రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

**కల్లూరు జూలై 02(జనం సాక్షి)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తీసుకొచ్చిన విబిజి రామ్ జీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వంఉపసంహరించు కోవాలని సత్తుపల్లి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జునరావు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిఎర్రబోయినపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా సంఘం డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జునరావు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. వంద రోజులు ఉపాధిని 125 రోజులకు పెంచుతున్నామని కేంద్రప్రభుత్వంచెబుతున్నప్పటికీ దానికి తగినన్ని నిధులు కేటాయించలేదని అన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం 200 రోజులు పని కల్పించాలని రోజువారి వేతనం 800 రూపాయలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన చట్టం పెట్టుబడిదారులకు, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మికులు, గ్రామీణ పేదల, రైతుల హక్కులను హరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రాలు 40% నిధులు భరించే విధానం వల్ల రాష్ట్రాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం చట్టాన్ని ఉపసంహరించు కొని పాత పద్ధతిలోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కల్లూరు మండల అధ్యక్షులు దోమతోటి పుల్లయ్య ,వార్డు సభ్యులు బీరవల్లి మోహన్ రావు, రైతు సంఘం నాయకులు తిగుళ్ల బాబు,ఐద్వా మండల అధ్యక్షురాలు బీరవల్లి తిరుమల ,జగదీష్, వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల భద్రతకు సర్వీస్ రోడ్డు అత్యవసరం

## ప్రముఖ సామాజికవేత్త పిన్నింటి స్టాన్లీ

**భువనగిరి, జూలై 2 (జనంసాక్షి)**



జాతీయ రహదారి పక్కనే ఉన్న పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం వద్ద సర్వీస్ రోడ్డు, బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి రాకపోకలు సాగిస్తున్నారని ప్రముఖ ఫిలాంత్రోఫిస్ట్, సామాజికవేత్త పిన్నింటి స్టాన్లీ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టి ప్రత్యేక సర్వీస్ రోడ్డు నిర్మాణంతో పాటు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.
ఈ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని స్టాన్లీ, ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అశోక్ అగర్వాల్ తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన అశోక్ అగర్వాల్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ రోడ్లు?భవనాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తెలంగాణ ప్రాజెక్ట్ డైరెక్టర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్‌లకు లేఖలు రాశారు. విద్యాలయం వద్ద వెంటనే ప్రత్యేక సర్వీస్ రోడ్డు నిర్మించాలని, విద్యార్థుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఆయా లేఖల్లో కోరారు. "ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది విద్యార్థులు నాలుగు సార్లు జాతీయ రహదారిని దాటాల్సి వస్తోంది. బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో చిన్నారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరగకముందే ప్రభుత్వం స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి అని పిన్నింటి స్టాన్లీ విజ్ఞప్తి చేశారు. ఈ అంశానికి సంబంధించిన లేఖలను ఈ-మెయిల్, ఫ్యాక్స్ ద్వారా సంబంధిత అధికారులకు పంపించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

# లింగస్వామి మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

**రామన్నపేట, జూలై 2 (జనంసాక్షి):**



మండలంలోని ఉత్తటూరు గ్రామానికి చెందిన బందెల లింగస్వామి అనారోగ్యంతో మృతి చెందాడు.
గురువారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఉత్తటూరు గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి నాయకులు కోళ్ల కిషన్, జెట్టి సైదులు, పోతుల స్వామి, మేడి రాజు, జంగిలి శీను, బందెల నరసింహ, జంగిలి స్వామి, యాదయ్య, రాజు, వెంకన్న, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 1970 కంటే ముందు భూముల డాక్యుమెంట్ల సేకరణ

## తహసిల్దార్ శ్రీనివాసరావు



**నూతనకల్ జూలై 2 (జనంసాక్షి)**
మండల కేంద్రంలోని నూతనకల్ గ్రామపంచాయతీ నందు డాక్యుమెంట్స్ స్టేట్మెంట్లను సేకరించడం జరుగుతుంది గురువారం తహసిల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1970 కంటే ముందు భూములు కొనుగోలు చేసి అనుభవ దారులుగా ఉన్న రైతుల నుండి డాక్యుమెంట్స్ మరియు స్టేట్మెంట్ల ను సేకరించడం జరుగుతుందని తదుపరి కలెక్టర్ గారి ద్వారా నివేదిక పంపించి వారి ఆదేశాల ప్రకారం పట్టాలు మంజూరు చేయుటకు తగు చర్యలు తీసుకోబడును అని వారన్నారు బిఎల్వో లకు ఎంపీడీవో ఆఫీస్ లో సర్ పై అవగాహన కల్పిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఫారాలను తీసుకొని అప్లోడ్ చేయడం జరుగుతుందని తాసిల్దార్ శ్రీనివాసరావు అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ, జి పి ఓ లు బి ఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**రామన్నపేట, జూలై 2 (జనంసాక్షి):**



రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని 7వ వార్డులో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మిర్యాల రాజకుమార్ వార్డు సభ్యులు సండ్ల లింగయ్య, జువ్వగోని మల్లమ్మ, గంజి భాస్కర్, ఇడెం స్వరూప స్మారక సేవా సంస్థ అధ్యక్షులు ఇడెం శ్రీనివాస్, జింక శేఖర్, పాశం సతీష్ రెడ్డి, మదూరి నర్సింగరావు, రుద్ర ఉమాపతి, మొగిలి లింగయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు

## మున్సిపల్ కమిషనర్ కే రవీందర్ రెడ్డి

**హాలియా జూలై 2 జనంసాక్షి**

హాలియా పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే వారిపై ప్రత్యేక తనిఖీలు చేసి జరిమానాలు విధించినట్టు హాలియా గౌరవ మున్సిపల్ కమిషనర్ శ్రీ కె. రవీందర్ రెడ్డి తెలిపారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంబడ ఉనిన వాణిజ్య సముదాయాలు, దుకాణాల వద్ద నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించకుండా బహిరంగ ప్రదేశాల్లో పడవేస్తే జరిమానా తప్పదని కమిషనర్ హెచ్చరించారు.తనిఖీలలో నిబంధనలు ఉల్లంఘించిన అనేక వ్యాపారస్తులను గుర్తించి, ఘన వర్థాల నిర్వహణ నియమావళి-2026 (ౌనీశ్రీతిట చిజీబబివ ఓజీనిజీణవఏవనిబి ఖీబీశ్రీవబ-2026) పార్శ్వ ప్రకారమే వారికి జరిమానాలు విధించగా, ఈ చర్యలు పట్టణ పరిశుభ్రతను కాపాడటానికి భాగమన్నారు.కె. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, "హాలియా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడు, ప్రతి వ్యాపారవేత్త బాధ్యత. తడి, పొడి మరియు ఇతర వ్యర్థాలను తప్పనిసరిగా మున్సిపల్. వాహనాలకు అందించడం అనివార్యం. బహిరంగ ప్రదేశాల్లో చెత్తకి నిల్వ చేయగలిగితే కఠిన చర్యలు, జరిమానాలు కొనసాగతాం" అని చెప్పారు.ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఖలీల్, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, ప్రజా సిబ్బంది (జవాన్లు) పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం ప్రజల నుంచి మరియు వ్యాపారుల నుంచి సహకారం కోరుతూ, హాలియాను శుభ్రంగా, సురక్షితంగా ఉంచే విధంగా చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటుండటాన్ని గుర్తుచేశారు.



# రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ గా తాటికొండ

**తుంగతుర్తి జులై 2 (జనం సాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య పొలిటికల్ వైస్ చైర్మన్ గా తాటికొండ సీతయ్య ఎన్నికయ్యారు, ఈ మేరకు గురువారం ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ నుండి నియామక పత్రం అందుకున్నారు, తనను ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు లక్ష్మీనారాయణకు మరియు సహకరించిన జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలిపారు ఈయన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని బంద రామారం గ్రామానికి చెందిన వారు, ఆయన ఎన్నిక పట్ల సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ సంఘం ఉపాధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాస్, బండారు దయాకర్, ఈగ లక్ష్మయ్య, ఈగ నాగన్న, పోలవరపు సంతోష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



# బీసీ బంద్ సంపూర్ణ విజయవంతం

## బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ

**సంస్థాన్ నారాయణపురం జులై 2(జనంసాక్షి):**

బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన బీసీ బంద్ పిలుపునకు స్పందిస్తూ నారాయణపూర్ మండలంలో బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు పూర్తిగా బంద్ పాటించాయి. బంద్‌కు విద్యార్థులు, యువజనులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు విశేషంగా సహకరించి విజయవంతం చేశారు.ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడు కొప్పు రామకృష్ణ మాట్లాడుతూ, బీసీల హక్కులు, సంక్షేమం, విద్యా అవకాశాల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడం ఆనందదాకయమన్నారు. ప్రభుత్వం బీసీల సమస్యలను ఇకనైనా వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, యువజనులు, కళాశాలల యాజమాన్యాలు, ప్రజలకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోమండల యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొల్లూరి నవీన్, బి జె పి జిల్లా నాయకులు సూరపెల్లి శివాజీ, బి.ఆర్.ఎస్ యువజన నాయకులు పానుగోతు తరుణ్ నాయక్ , రాసమల్ల .సంజయ్ , చెర్క. శేఖర్ చెర్క .యశ్వంత్ , చంద్రశేఖర్ వంగరి. సాయి తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవింపజేసే క్షేత్రం రమణేశ్వర క్షేత్రం

## విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సత్యం



**యాదాద్రి, కరస్పాండెంట్ జులై 2 (జనంసాక్షి)**

భారతీయ ఆధ్యాత్మిక, సంస్కృతి గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవింపజేసే క్షేత్రం రమణేశ్వర క్షేత్రం అని విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సత్యం అన్నారు. గురువారం తెలంగాణలోని విశిష్ట శైవ క్షేత్రమైన రమణేశ్వర మహాక్షేత్రాన్ని విశ్వ హిందూ పరిషత్ ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ సత్యం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. అనంతరం రమణేశ్వర మహాక్షేత్రంలోని పవిత్రమైన బంగారు శివలింగానికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు.

రమణేశ్వరంలోని ద్విసహస్ర శివలింగాలు, శ్రీచక్రాలు, వివిధ దేవతా ఆలయాలను దర్శించిన సత్యం ఆధ్యాత్మిక ఆనందాన్ని వ్యక్తం చేశారు. రమణేశ్వరంలో హిందూ ధర్మానికి చెందిన అన్ని రకాల దేవతామూర్తులు, దేవతల విగ్రహాలు దర్శనమిస్తున్నాయని, ఇది సనాతన ధర్మ వైభవాన్ని ఒకేచోట ప్రతిబింబించే మహాక్షేత్రమని ఆయన అన్నారు. వేదాగమ సంప్రదాయాలు, శివారాధన, శ్రీచక్రారాధన, భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి గొప్పతనాన్ని ప్రత్యక్షంగా అనుభవింపజేసే క్షేత్రంగా రమణేశ్వరం నిలుస్తోందని అభిప్రాయపడిన సత్యం, ఈ క్షేత్ర నిర్మాణంలో ఇమిడి ఉన్న వేద, ఆగమ శాస్త్ర పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకున్నారు. తెలంగాణ భూమిపై ఇలాంటి గొప్ప శైవ క్షేత్రం వెలసి ఉండటం హిందూ సమాజానికి గర్వకారణమని, ఇది తెలంగాణను దేశంలోనే ఒక మహా శైవ క్షేత్రంగా నిలబెడుతుందని ఆయన పేర్కొన్నారు. సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారి దార్శనికత వల్ల సాధ్యమైన ఈ నిర్మాణం, రాబోయే తరాలకు హిందూ ధర్మంపై అవగాహన, గౌరవం పెంపొందించడంలో విశేషంగా దోహదపడుతుందని ఆయన అన్నారు. యువత కేవలం ఆధునిక విద్యలోనే కాకుండా, మన ధర్మం, సంస్కృతి, ఆధ్యాత్మిక సంపద గురించి కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సత్యం అభిప్రాయపడ్డారు. రమణేశ్వరంలాంటి క్షేత్రాలు యువతకు హిందూ ధర్మం యొక్క లోతు, శాస్త్రీయత, ఆధ్యాత్మికతను పరిచయం చేసే ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.ఇలాంటి పవిత్ర క్షేత్రాలను ప్రతి హిందువు దర్శించి, సనాతన ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సత్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ స్టేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర రాజు స్టేట్ జాయింట్ సెక్రటరీ భాను ప్రసాద్ స్టేట్ టోలి మెంబర్ మురళీ మోహన్ రెడ్డి గ స్టేట్ టోలి మెంబర్ రవి ప్రకాశ్ రెడ్డి స్టేట్ టోలి మెంబర్ చంద్ర మోహన్ భువనగిరి ఇంచార్జ్ శ్రీనివాస్ సహా పలువురు ప్రముఖ విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

# బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొగులయ్యకు ఘన సన్మానం

**రామన్నపేట, జూలై 2 (జనంసాక్షి):**



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నకిరేకంటి మొగులయ్య నియమితులైన సందర్భంగా గురువారం రామన్నపేట సుభాష్ సెంటర్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు మొగులయ్యను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ అడుగుజాడల్లో నడుస్తూ నిబద్ధత కలిగిన బీజేపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ పార్టీ అవకాశాలు కల్పిస్తుందన్నారు. సామాన్య కార్యకర్త కూడా బీజేపీ పార్టీలో రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అధ్యక్షులు, ప్రధానమంత్రి స్థాయికి ఎదిగే అవకాశం ఒక బీజేపీలోనే సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్ మండల ఇన్చార్జి కొరివి శంకర్ మండల ప్రధాన కార్యదర్శిలు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్ ఉపాధ్యక్షుడు బట్టే రమేష్ కార్యదర్శి బాత్క నరేష్ సీనియర్ నాయకులు జల్ల లక్ష్మీనారాయణ రాజు, గజం సత్యం, గోపగోని ధర్మరాజు, ఆకిటి యాదయ్య, రాపోలు విశ్వనాథం, యాదయ్య, వెంకట్, వీరమల్ల సత్యనారాయణ, గండికోట శీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్యారం బోర్డు టెన్నికైట్స్ గ్రీన్ మ్యాట్ నోట్ బుక్స్ వితరణ

**నూతనకల్ జూలై 2 (జనంసాక్షి)**

మండల పరిధిలోని ఎంపీపీ ఎస్ ఎర్రపహాడ్ లో విద్యార్థులకు అభ్యసన సామాగ్రి పంపిణీ చేశారు. గురువారం స్థానిక పాఠశాల ఉపాధ్యాయుడు సామ సవేందర్ రెడ్డి కుమారుడు జననేయెంధర్ రెడ్డి కోరిక మేరకు 40 వేల విలువగల విద్యార్థుల అభ్యసన సామాగ్రి, క్యారం బోర్డు, గ్రీన్ మ్యాట్, పెన్నులు పెన్సిల్లు మొదలైనవి ఎర్ర పహాడ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనంతుల కళావతి సహచర ఉపాధ్యాయుల సమక్షంలో 104 మంది విద్యార్థులకు అందించారు.





## ధర్వేశిపురం నుండి తేల కంటి గూడెం వరకు తారు రోడ్ల నిర్మాణానికి పనులు ప్రారంభం

**కనగల్, జులై 2 (జనంసాక్షి)**

దర్వేష్ పురం నుండి వయ్యా చర్ల గౌరారం గ్రామం మీదుగా తేల కంటి గూడెం వరకు 25 కోట్ల రూపాయల నిధులతోతారు (బీటి) రోడ్ల నిర్మాణానికి గురువారం స్థానిక సర్పంచ్ రాయల శేఖర్, ఆర్ అండ్ బి ఎస్ సి శ్రీధర్ రెడ్డి, ఆలయ చైర్మన్ చీదేటి వెంకటరెడ్డి లు కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాయల శేఖర్ మాట్లాడుతూ ధర్వేషపురం నుండి తేల కంటి గూడెం గ్రామం వరకు సుమారుగా 8 కిలోమీటర్ల మేర మెరుగైన రోడ్డు సౌకర్యం కలగడంతో ఆ గ్రామాల నుంచి అమ్మవారి ఆలయము వద్దకు వచ్చే భక్తులకు దూర ప్రయాణం సులభతరంగా మారనుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డి ఈ గణేష్ ఏఈ శ్రీకాంత్ ఆలయ మాజీ చైర్మన్ కే గోపాల్ రెడ్డి, ధర్వేశిపురం గ్రామ ఉపసర్పంచ్ కొమ్మగొని జానకమ్మ పాపయ్య, కే వెంకన్న, సైదులు, సాయి గుత్తేదారులు అభిషేక్, సురేందర్ తదితరులు ఉన్నారు.

## మత్తు ముసుగు తొలగించి నవ సమాజాన్ని నిర్మిద్దాం




**కోదాడ,( జనం సాక్షి):**

మత్తు ముసుగు తొలగించి నవ సమాజాన్ని నిర్మిద్దామని కోదాడ టౌన్ ఎస్ఐ బి.సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం కె. ఆర్. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. విభాగం , పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ పై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ, రవాణాలను అరికట్టడం సమాజ శ్రేయస్సుకు అత్యవసరమని, దీనిలో యువత కీలకంగా వ్యవహరించాలని, మత్తు పదార్థాలు ఉపయోగించడంతో ఆరోగ్యం క్షీణించి, మానసికంగా దృఢత్వాన్ని కోల్పోయి, ఆర్థికంగా కృంగిపోయి, నేర ప్రవృత్తికి అలవాటు పడి సంఘ వ్యతిరేక శక్తులుగా తయారవుతారని అందుకని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అందరికీ ఆయన పిలుపునిచ్చారు. చిన్న వయసులో డ్రగ్స్ ఉపయోగించడం వలన వ్యసన పరులుగా మారే అవకాశం ఉందని, డ్రగ్స్ అమ్మినా, స్వీకరించినా నేరస్తులు అవుతారని అలాంటి వారికి జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. సభ అనంతరం విద్యార్థుల చేత డ్రగ్స్ కి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. తదనంతరం మత్తు పదార్థాల నివారణ పై పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వేముల వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**వలిగొండ, జూలై 2 (జనంసాక్షి)**

మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన వెల్లంకి స్పందన రమేష్ 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంజూరు కాగా సర్పంచ్ ఏర్పుల వెంకటేశం, ఉప సర్పంచ్ అంబటి సాయికుమార్ గురువారం అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ రిలీజ్ అయ్యేలా సహకరించినందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి లబ్ధిదారుల ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి




**సూర్యాపేట(జనంసాక్షి):**

జిల్లాలో వైద్య సేవల మెరుగుదలకు ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వైద్యుల సహకారం ఎంతో అవసరమని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు.బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో బుధవారం రాత్రి డాక్టర్స్ డే వేడుకలను, ఐఎంఏ సూర్యాపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సమాజంలో ఆడ శిశువు రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధమైన చర్యలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి వైద్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.చట్టాలను ఉల్లంఘించే చర్యలకు దూరంగా ఉండాలని, వైద్య వృత్తి గౌరవాన్ని కాపాడాలని కోరారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగిని మానవీయ దృక్పథంతో ఆదరిస్తూ, నాణ్యమైన, పారదర్శక వైద్య సేవలు అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సరైన చికిత్సను అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజారోగ్య కార్యక్రమాల్లో ప్రైవేటు వైద్యులు భాగస్వాములు కావాలని అన్నారు. ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత, రోగుల భద్రత, వైద్య వ్యర్థాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, అత్యవసర వైద్య పరికరాల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

ప్రతి ఆసుపత్రి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు విశ్వసనీయ వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వం, ప్రైవేటు వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయం తో పనిచేస్తే ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఐఎంఏ సూర్యాపేట నూతన అధ్యక్షులు సాల్వాది రమేష్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు.వైద్య వృత్తిలోకి వచ్చే వారికి మార్గదర్శకంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డాక్టర్లు వూర రామ్మూర్తి యాదవ్, సెక్రెటరీ డాక్టర్ రామకృష్ణ,ఐఎంఏ సూర్యాపేట నూతనజనరల్ సెక్రటరీ డాక్టర్ వాగ్మేర్ ఆనంద్ రావు, కోశాధికారి డాక్టర్ ఉపేందర్ సింగ్, జాతీయ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ విజయ్ మోహన్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు డాక్టర్ ఘంట దయాకర్ రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రమేష్ చంద్ర, ఉపాధ్యక్షులు డాక్టర్ విజయ లక్ష్మి, డాక్టర్ ప్రమీల, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ రమేష్, డాక్టర్ రవీంద్ర నాయక్, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ మీలా సందీప్, డాక్టర్ సుధీర్ కుమార్, డాక్టర్ విక్రమ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ రాజ్ మనోహర్ రెడ్డి, డాక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ ఎంఎస్ఎన్ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు డాక్టర్లు స్వాతి, గౌతమి, అనూష, సంధ్య, శ్రీధర్ రెడ్డి, నరేష్, అబిద్ అహ్మద్, రవి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల ఆశాకిరణం..

- ఉద్యమ యోధుడు సంగెపు గిరినేత ఎన్నికల బరిలో
- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో చేనేత రంగ సేవకు ముందుకు..
- వట్టిపల్లి చేనేత సహకార సంఘం ఎన్నికల్లో నామినేషన్ దాఖలు

**మర్రిగూడ, జూలై 2 (జనంసాక్షి)**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ అనేక ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఉద్యమకారుడు సంగెపు గిరినేత ఇప్పుడు చేనేత కార్మికుల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని వట్టిపల్లి మిశ్రమ చేనేత సహకార ఉత్పత్తి మరియు విక్రయ సంఘం ఎన్నికల బరిలోకి దిగారు. గురువారం ఆయన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించారు.ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, మొక్కవోని దీక్షతో పోరాడే వ్యక్తిగా సంగెపు గిరినేతకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువత, ప్రజా సంఘాలతో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, రాష్ట్ర సాధన కోసం తన వంతు కృషి చేశారని గుర్తు చేస్తున్నారు.చేనేత కార్మికుల సంక్షేమం, సంఘంలో పారదర్శక పాలన, ప్రభుత్వ పథకాలను ప్రతి సభ్యునికి చేరేలా చేయడం, నేత కార్మికుల జీవనోపాధి మెరుగుపర్చడం తన ప్రధాన లక్ష్యాలని గిరినేత తెలిపారు. సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుని సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు.వట్టిపల్లి మిశ్రమ చేనేత సహకార సంఘం సభ్యులందరూ ఎన్నికల్లో పాల్గొని తనకు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నామినేషన్ కార్యక్రమంలో సంఘ సభ్యులు, చేనేత కార్మికులు, పద్మశాలి సంఘ నాయకులు, అభిమానులు పాల్గొని ఆయనకు విజయాభినందనలు తెలిపారు.





## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**

పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జూనియర్, డిగ్రీ కళాశాలల బంద్ ను నిర్వహించారు.ఈ సందర్భంగా నిద్ర సంపత్ నాయుడు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో వేలాది మంది పేద విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ తమ చదువులను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు.విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థుల హక్కులను పరిరక్షించడం, సంక్షేమ పథకాలను సమర్థ వంతంగా అమలు చేయించడం బీసీ విద్యార్థి సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు సురేష్ నాయక్, గుండ బాచి వర్మ, అనిల్, నరేష్, మౌనిక, సంధ్య, నవ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# శివన్నగూడెం ప్రాజెక్టు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రికి వినతి





**చౌటుప్పల్ జూలై 2 (జనంసాక్షి)**
శివన్నగూడెం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు సాగు, త్రాగునీటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఇ.ఎల్.వి.భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్, డైరెక్టర్ అశోక్ లు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, స్థానిక రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా :కొప్పుల రాంరెడ్డి

**నేరేడుచర్ల (జనంసాక్షి):**
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నేరేడుచర్ల నందు అధ్యక్షులుగా కొప్పుల రాంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం అధ్యక్షుడును, డైరెక్టర్లు ఉ రైతులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి ,మార్కెట్ వైస్ చైర్మన్ తాళ్ళ సురేష్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జావేద్, పత్తేపురం సర్పంచి కోనుగంటి సూజాత సోమిరెడ్డి, సంఘ డైరెక్టర్లు దేవులపల్లి శంకరాచారి, వేముల జయమ్మ ఫ్రాన్సిస్,నూకల వెంకట్ రెడ్డి సఫావత్ భీక్యా, కుసుమ శేఖర్ రెడ్డి, నాయకులు సంకలమద్ది లీలా మాన్న రెడ్డి, కోణతం వెంకట్ రెడ్డి,నూకల రాంరెడ్డి, వెంకట్ రెడ్డి, మురళీధర్ రెడ్డి,.సైదిరెడ్డి, గోపాల్,మధుకర్ రెడ్డి, మల్లారెడ్డి, సుందర్ రెడ్డి,వెంకటయ్య, వెంకట్ రెడ్డి, వెంకట్ రెడ్డి,అచ్చిరెడ్డి, మహేష్ తదితరులు, పాల్గొన్నారు.

## రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వివక్ష

### ఎమ్మెల్సీ కోటిరెడ్డి ధ్వజమెత్తారు

### నాయకుడు పాశం గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

**గుర్రంపోడు: జూలై 2 (జనంసాక్షి)**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర వివక్ష చూపిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎం.సి.కోటిరెడ్డి ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన 24 గంటల ఉచిత కరెంట్‌ను ప్రస్తుత ప్రభుత్వం సరిగ్గా ఇవ్వకుండా రైతులను ఘోరంగా మోసం చేస్తోందని ఆయన ఆరోపించారు. గురువారం గుర్రంపోడు మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కోటిరెడ్డి కేక్ కట్ చేసి పాశం గోపాల్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారిందని, తూకంలో ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం, వారిని నిలువునా ముంచుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## గుర్రంపోడులో ఘనంగా పాశం గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు..

### ముఖ్య అతిథిగా హాజరై.. గోపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ ఎం.సీ కోటిరెడ్డి

**గుర్రంపోడు:జూలై 2 (జనంసాక్షి)**
నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం గుర్రంపోడు మండల కేంద్రంలోని గోపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తల సమక్షంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఎం.సీ కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాశం గోపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాశం గోపాల్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకొని భవిష్యత్తులో ఉన్నతమైన పదవులు అధిరోహించి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని పేర్కొన్నారు. పాశం గోపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా గుర్రంపోడు మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గుర్రంపోడు ప్రభుత్వ వైద్యశాలలోని పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు మండల బీఆర్ఎస్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## హైస్కూల్ గోడను ఆక్రమించి షాపుల నిర్మాణం.. మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

**చండూరు, జూన్ 2 (జనంసాక్షి)**
స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) ప్రహరీ గోడను ఆక్రమించి అక్రమంగా మడిగెలు (షాపులు) నిర్మిస్తున్నారంటూ పట్టణ యువకులు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన గండూరి జనార్దన్, దోటి వెంకటేశం అనే వ్యక్తులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా మున్సిపల్ షాపులను కేటాయించింది. వారు ఆ షాపులను 7,500లకు అద్దెకు తీసుకుని, ఇతరులకు 14,000 లకు సబ్-లీజుకు ఇస్తూ లాభపడుతున్నారు. అయినప్పటికీ, ఎలాంటి పట్టా పత్రాలు లేకుండా దౌర్జన్యంగా 'గ్రామ కంఠం' భూమిలో ఉన్న హైస్కూల్ ప్రహరీ గోడను తొలగించి, పాఠశాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని యువకులు ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తి అయిన పాఠశాల స్థలాన్ని కాపాడాలని, ఈ అక్రమ నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కన్నబోయిన నాగరాజు, ఏకాలపు ఆంజనేయులు, గురిజ రమేష్, బెల్లంకొండ వినయ్ తదితర యువకులు వినతిపత్రంలో అధికారులను కోరారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాక మల్లేష్ యాదవ్



**భూదాన్ పోచంపల్లి, జూలై 2 (జనంసాక్షి):**
రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాక మల్లేష్ యాదవ్ అన్నారు. బుధవారం పోచంపల్లి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వానాకాల పంటల సాగు ప్రారంభమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులను విడుదల చేయడం హర్షణీయమని తెలిపారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సారథ్యంలో గత రబీ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి, 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ బోడిగె శంకరయ్య, మండల నాయకులు వెంకటేష్, కంటే లింగస్వామి, పానగంటి లింగస్వామి, బుర్రి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి

### ఎంఎస్ కె ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ విజేతలకు బహుమతులు అందజేత

**సూర్యాపేట(జనంసాక్షి):**
యువత క్రీడల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్ కె ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో జరిగిన ఎంఎస్ కె ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ విజేతలకు బహుమతుల అందజేత కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారిని మరింత ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించేందుకే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని అన్నారు. ఈ పోటీలలో విన్నర్ గా ఎంఎస్ కె రాయల్ చాలెంజర్స్, రన్నరప్ గా ఎమ్మెస్ కె కింగ్స్ నిలిచారు. ఈ కార్యక్రమంలో వెన్న శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, వీరమల్లు సైదులు, తేజ నాయుడు, కిషోర్, సుర సైదులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యోగార్థులకు శుభవార్త..!

**అన్నపురెడ్డిపల్లి, జూలై 2 (జనంసాక్షి)** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐటీసీ, ప్రథమ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో, అన్నపురెడ్డిపల్లి మండల సర్పంచ్ సహకారంతో ఈ నెల 6వ తేదీ సోమవారం అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఎన్. వెంకట్రావు తెలిపారు. ఈ మేరకు గురువారం అన్నపురెడ్డిపల్లి రైతు వేదికలో ఎంపీడీవో, సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో జాబ్ మేళా నిర్వహణపై నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. జాబ్ మేళా ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఎలక్ట్రిషన్, సోలార్ రంగాల్లో 30 రోజుల పాటు పూర్తిగా ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో యూనిఫామ్ కూడా ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వేతనంతో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

8వ, 9వ, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా చదివిన 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల జిరాక్స్ ధ్రువపత్రాలతో ఈ నెల 6న అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. కేవలం 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో సర్పంచులు లాకావత్ లక్ష్మి, కొండ్రు సృజన, అశోక్, సంఘవి తదితరులు పాల్గొన్నారు.






- అన్నపురెడ్డిపల్లిలో ఉచిత జాబ్ మేళా - 30 రోజుల శిక్షణతో ప్రైవేట్ ఉద్యోగాలు
- ఐటీసీ-ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహణ
- ఎలక్ట్రిషన్, సోలార్ రంగాల్లో ఉచిత శిక్షణ - సర్టిఫికెట్, యూనిఫామ్, ఉద్యోగావకాశం

# రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య
- 2.98 లక్షల మంది రైతులకు రైతు భరోసా జమ
- నియోజకవర్గాల వారీగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసిన ప్రభుత్వం



**ఖమ్మం కార్పొరేషన్, జూలై-2 ( జనంసాక్షి )** వానాకాలం?2026 సీజన్‌కు సంబంధించి 4 ఎకరాల వరకు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం క్రింద ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 2,98,513 మంది రైతులకు 255.75 కోట్లు రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలుపుతూ, నియోజకవర్గాల వారీగా రైతు భరోసా జమ వివరాలు వెల్లడించారు. ఖమ్మం నియోజకవర్గంలో 16,197 మంది రైతులకు రూ.14.69 కోట్లు, పాలేరు నియోజక వర్గంలో 71,029 మంది రైతులకు రూ.58.08 కోట్లు, సత్తుపల్లి నియోజక వర్గంలో 74,682 మంది రైతులకు రూ.62.19 కోట్లు, మధిర నియోజకవర్గంలో 78,832 మంది రైతులకు రూ.66.28 కోట్లు, వైరా నియోజకవర్గంలో 56,673 మంది రైతులకు రూ.53.78 కోట్లు, ఇల్లందు నియోజక వర్గంలోని కామేపల్లి మండలంలోని 1,100 మంది రైతులకు రూ.73 లక్షలు జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా సాగు ప్రారంభ దశలో రైతులకు అవసరమైన పెట్టుబడి సకాలంలో అందడంతో వ్యవసాయ పనులు వేగవంతంగా చేపట్టేందుకు ఈ ఆర్థిక సహాయం దోహదపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలను పరిశీలించి ప్రభుత్వం జమ చేసిన రైతు భరోసా మొత్తాన్ని నిర్ధారించుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రైతు భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం ప్రయోజనం అందేలా వ్యవసాయ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటోందని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఎర్రగుంట పాఠశాలలో సామాజిక తనిఖీ

**విద్యా ప్రమాణాలు, వసతులపై హైదరాబాద్ బృందం సమగ్ర పరిశీలన**

**నివేదికను రాష్ట్ర విద్యాశాఖకు నేరుగా సమర్పించనున్న అధికారులు**

**అన్నపురెడ్డిపల్లి, జూలై 2 ( జనం సాక్షి )** మండలం ఎర్రగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి సామాజిక తనిఖీ బృందం గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్ నుంచి వచ్చిన సామాజిక తనిఖీ బృందం పాఠశాల విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతులపై సమగ్రంగా పరిశీలించి వివరాలను సేకరించింది. రాష్ట్ర సామాజిక తనిఖీ బృందం నాయకుడు బి. సంపత్ కుమార్, సభ్యురాలు పాయం సత్యలీల పాఠశాలలో అమలవుతున్న అన్ని కార్యక్రమాలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామస్తులతో విడివిడిగా సమావేశమై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, గ్రంథాలయం, ప్రయోగశాలలు, క్రీడా సామగ్రి, భౌతిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే సమగ్ర శిక్ష నిధుల వినియోగంపై ప్రధానోపాధ్యాయుల నుంచి పూర్తి వివరాలు సేకరించారు. తనిఖీల అనంతరం సిద్ధం చేసే సమగ్ర నివేదికను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు నేరుగా సమర్పించనున్నట్లు బృందం తెలిపింది. ఈ నివేదిక ఆధారంగా పాఠశాలల నిర్వహణలో అవసరమైన మార్పులు, మెరుగుదల చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉండేటి ఆనందకుమార్, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి కే. మోహన్‌రావు, ఇన్‌చార్జ్ శంకర మహదేవన్, ఉపాధ్యాయులు సునంద రెడ్డి, శాంతకుమారి, రాజ్యలక్ష్మి, బాబురావు, వెంకటేశ్వర్లు, బాలు, వసంత, సుశీల, పద్మ, మోతీలాల్, జయరాం, ప్రసాద్, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, ఖాసిం, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ శిరీష, మండల డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకటరమణ, తొలి అడుగు ఫౌండేషన్ సభ్యుడు లాలయ్య, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఘనంగా

**ఆలయ ఛైర్మెన్ గా యండపల్లి శ్రీనివాసరావు**



**చింతకాని, జూలై 2 ( జనం సాక్షి)** చింతకాని గ్రామంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్‌గా యండపల్లి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం డివిజన్ దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్. సమత, ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) రామకోటేశ్వర రావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, గోపిచార్యులు, ఆలయ నిర్వాహకులు నాగార్జున సమక్షంలో నూతన కమిటీ సభ్యులు కొమ్మిని రామారావు, తూము భిక్షం, పెద్దగౌండ్ల వెంకటనారాయణ, కొడవకంటి రాంబాబు, బండి తీరపయ్యతో పాటు ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, చింతకాని మాజీ సర్పంచ్, ఖమ్మం జిల్లా మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మాడిపల్లి భాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్ బండి సైదేశ్వర్ రావు హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# కల్లూరు ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం

**514 ఓరెంటేషన్ కోర్సులు 21 రోజులు శిక్షణ**



కల్లూరు జూలై02(జనం సాక్షి)

మండల పరిధిలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో ఇంగ్లీష్ టీచర్గా పని చేస్తున్నా దిగు మర్తి శిరీష కు అరుదైన గౌరవం లభించింది

భారతదేశ వ్యాప్తంగా న్యూఢిల్లీలో నిర్వహించిన 514 ఓరియంటేషన్ కోర్స్ 21 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నరు. భారతీయ కళలు, సంస్కృతి సంప్రదాయాలు, వారసత్వం విలువలు, సంగీతం జానపదం గీతాలు నృత్యం చిత్రలేఖన వంటి శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో తెలియపరిచే విధంగా శిక్షణ పొందారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుండి మొత్తం 8 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణకు ఎంపిక కాగా, ఖమ్మం జిల్లా నుండి తనను ఎంపిక చేసి పంపించడం నాకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమానికి 52 సంవత్సరాల లోపు ఉన్న ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కోసం పప్పెట్రీ (పుప్పెటరీ ) వంటి ప్రత్యేక శిక్షణా తరగతులు కూడా నిర్వహిస్తారు. ఈ శిక్షణా కార్యక్రమం ప్రతి ఉపాధ్యాయునికి ఎంతో ఉపయోగకరమైనది, ప్రేరణాత్మకమైనది. కాబట్టి అర్హత ఉన్న ఉపాధ్యాయులందరూ ఈ అవకాశాన్ని తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అమూల్యమైన అవకాశాన్ని కల్పించిన సి .సి .ఆర్ .టీ చైర్మన్ కి, సీ .సీ .ర్ .టీ డైరెక్టర్ కి సీ ,.సీ .ఇ .ఆర్ .టీ డైరెక్టర్ గారికి, మా జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇవో)కి, మా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను నా విద్యార్థులకు, నా పాఠశాలకు , సమాజానికి ఉపయోగపడే విధంగా అమలు చేయడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తాను అన్నారు.